## క్లుప్తంగా

### సైబర్ నేరాలపై జాగ్రత్త



పోలీసు కళాజాతాలో మాట్లాడుతున్న సీఐ

వరంగల్: సాంకేతిక పరిజ్ఞానంతో పెరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తతతో ఉండాలని, బాల్య వివాహాలను అరికట్టాలని ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ మహేందర్ పిలుపునిచ్చారు. గంజాయి, బాల్య వివాహాలు, వాహనాల స్పీడ్, సైబర్ క్రైంలపై ఏనుమాముల పోలీసుస్టేషన్ పరిధిలోని ఆరెపల్లి గ్రామంలో పోలీసు కళాబృందం సభ్యులు ఆదివారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్ మాట్లాడుతూ వాహనాలను అతివేగంగా నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో ఏనుమాముల ఎస్సై రాజన్‌బాబు, స్థానికులు పాల్గొన్నారు.

### కళ్ల దానం మహా గొప్పది



మృతురాలి కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ అందిస్తున్న కార్పొరేటర్ రాములు

కాజీపేట: కళ్ల దానం మహా గొప్పదని, మృతుడి నేత్రాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకురావడం అభినందనీయమని కార్పొరేటర్ ఎలకంటి రాములు ప్రశంసించారు. కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ కాలనీలో నేత్రదానం చేసిన తనుగుల జులియమ్మ సంస్మరణ సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మరణానంతరం నేత్రదానం చేయడానికి 40 మంది సిస్టర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. కార్యక్రమంలో ఫాదర్ గోపు ప్రకాష్ ప్రదీప్, మథ్యాస్ రెడ్డి, మర్రెడ్డి, రాణి తదితరులు పాల్గొన్నారు.

### భద్రకాళి మున్నూరుకాపు పరపతి సంఘం కార్యవర్గం ఎన్నిక



పరపతి సంఘం నూతన కార్యవర్గం

హన్మకొండ చౌరస్తా: భద్రకాళి మున్నూరుకాపు పొదుపు, పరపతి పరస్పర సహాయ సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు 9వ డివిజన్ రాయపురలోని ఓంశాంతి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగాయి. నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా తుల రమేష్ ప్రకటించారు. అధ్యక్షుడిగా పోతురాజు తిరుమల్‌రావు, ఉపాధ్యక్షులుగా గాండ్ల సంతోష్, తుల రాజు, ప్రధాన కార్యదర్శిగా లక్కాకుల రాజు, సహాయ కార్యదర్శులుగా అనుమాండ్ల భాస్కర్, తుల రమేష్, కోశాధికారిగా సత్తు భిక్షపతి, నిర్వహణ కార్యదర్శి లక్కాకుల గోపి, డైరెక్టర్లుగా బొల్లం అమరావతి, మెట్టు నరేష్, మడిదొడ్ల రజిత, కంచర్ల రవి, ముఖ్య సలహాదారుడిగా రచ్చూరి శ్రీకాంత్ బాబు ఎన్నికైనట్లు తెలిపారు.

### వీర హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలి



శోభాయాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు

కాశిబుగ్గ: వచ్చే నెల 6న నగరంలో జరగనున్న వీర హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్వ హిందూ పరిషత్ కార్యదర్శి శ్రీరాం ఉదయ్ పిలుపునిచ్చారు. కాశిబుగ్గలోని శివాలయం వద్ద శోభాయాత్ర వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. వరంగల్ రంగశాయిపేట దేవాలయం నుంచి హనుమకొండ పద్మాక్షి దేవాలయం వరకు బైక్ ర్యాలీ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు రిషి, రవికుమార్, తౌటం తిరుమల్, కిషన్ రావు, సముద్రాల పరమేశ్వర్, కోమాకుల నాగరాజు, ఓం ప్రకాష్ కోలారియా, రఘునారెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

### ఆయుష్మాన్ భారత్ కార్డుల జారీ



కేంద్రాన్ని ప్రారంభించిన రావు పద్మ

కాజీపేట: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ కార్డుల జారీ ప్రక్రియను కాజీపేట 63వ డివిజన్ మహంకాళమ్మ తల్లి దేవాలయం సమీపంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ గుంటి కుమారస్వామి, కమతం శ్రీనివాస్, గొని సాంబయ్య, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్‌లో పశువుల స్వైర విహారం

- లక్ష్మీపురం మోడల్ మార్కెట్‌లో నిర్మించని క్యాటిల్ ట్రాప్స్
- కానరాని భద్రతా చర్యలు
- దృష్టి సారించని అధికారులు, పాలకులు



మార్కెట్‌లో సంచరిస్తున్న పశువులు, మేకలు



క్యాటిల్ ట్రాప్స్ లేని కూరగాయల మార్కెట్ గేట్

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌లో పశువులు స్వైర విహారం చేయడంతో వ్యాపారులు, వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. పాత కూరగాయల మార్కెట్‌కు గేట్లు లేకపోవడంతో పశువుల రాకపోకలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. మోడల్ మార్కెట్‌లోని కమీషన్ వ్యాపారులతో పాటు కవర్‌షెడ్‌తో పాటు ప్లాట్లలో సుమారు 230మంది చిల్లర వ్యాపారులు కూరగాయలు విక్రయిస్తున్నారు. వారితో పాటు రైతుబజార్ వద్ద మోడల్ మార్కెట్ చుట్టూ మరో 200మందికి పైగా కూరగాయలు అమ్ముతారు. ఉదయం వేళలో తాజా కూరగాయలు విక్రయించిన అనంతరం నాణ్యతలేని, కుళ్లిపోయిన కూరగాయలను వ్యాపారులు రోడ్లపై పారబోస్తుండంతో వాటిని తినేందుకు మార్కెట్‌కు పశువులు, మేకలు వరుస కడుతున్నాయి.

**తగినంత మంది సెక్యూరిటీ గార్డులు లేరు**

నిత్యం సుమారు 5వేల మందికి పైగా వినియోగదారులు ఈ మార్కెట్‌కు వస్తుంటారు. ఎక్కడపడితే అక్కడ కూరగాయలు పడవేయడంతో వాటిని తినేందుకు మూగజీవాలు వస్తున్నాయి. ఐదు గేట్లు పెట్టిన అధికారులు గేట్‌కు ఒక్కరి చొప్పున సెక్యూరిటీ గార్డులను నియమించలేదు. కేవలం నలుగురు సెక్యూరిటీ గార్డులను మోడల్ మార్కెట్‌కు కేటాయించడంతో నియంత్రణ లేకుండా పోయింది. గతంలో పశువుల దాడిలో హమాలీ నాయకుడు ఆస్పత్రి పాలయ్యాడు. అదేవిధంగా ఒక వ్యాపారిపై దాడి చేయడంతో అతని చేయి విరిగింది. అప్పుడు మార్కెట్ అధికారులు పశువులను బంధించి యజమానులను పిలిపించి హెచ్చరించి వదిలేశారు. అనంతరం, పశువులు మళ్లీ మార్కెట్‌లోకి యథేచ్ఛగా వస్తున్నాయి. కింద కూర్చుని వ్యాపారం చేస్తున్న చిల్లర వ్యాపారుల వద్దకు వచ్చి కూరగాయలను పశువులు తింటున్నా దాడి చేస్తాయన్న భయంతో వాటిని కొట్టలేకపోతున్నారు. ఇంత జరుగుతున్నా అదనంగా సెక్యూరిటీ గార్డులను కేటాయించేందుకు అధికారులు, పాలకవర్గ సభ్యులు దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**నిర్మించని క్యాటిల్ ట్రాప్స్**

ప్రభుత్వ కార్యాలయాల ముందు పశువులు లోపలికి రాకుండా క్యాటిల్ ట్రాప్‌లు నిర్మిస్తారు. సుమారు రూ.6.50కోట్ల వ్యయంతో నిర్మించిన మోడల్ కూరగాయల మార్కెట్‌లో ఐదు గేట్లు ఏర్పాటు చేసి ఆ గేట్ల ముందు క్యాటిల్ ట్రాప్స్‌ను పెట్టకపోవడం విశేషం. క్యాటిల్ ట్రాప్స్ లేకపోవడంతో మార్కెట్‌లోకి పశువులు సంచరిస్తున్నాయి. కనీసం సెక్యూరిటీ గార్డులను గేటుకు ఒక్కరి చొప్పున పెడితే లోపలికి పశువులు రాకుండా ఉండేదని వ్యాపారులు వాపోతున్నారు. అదేవిధంగా మార్కెట్‌లో వాహనాలను ఇష్టానుసారంగా చేస్తున్న పార్కింగ్‌కు అడ్డుకట్ట పడే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఇప్పటికైనా క్యాటల్ ట్రాప్స్ నిర్మించేంత వరకు అదనంగా సెక్యూరిటీ గార్డులను నియమించి పశువుల దాడుల నుంచి కాపాడాలని వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆశీర్వదించి.. ఆదరించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

హసన్‌పర్తి: మరోసారి బీఆర్‌ఎస్ పార్టీని ఆశీర్వదించి.. ఆదరించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ వేడుకున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ చేపట్టిన ఆత్మీయ సమ్మేళనాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. 56వ డివిజన్‌లో ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, రాష్ట్రంలో మూడవ సారి అధికారంలోకి రావడమే లక్ష్యంగా ముందుకు సాగాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. కేంద్రంలో బీజేపీ పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని చెప్పారు. కొన్ని రాజకీయ పార్టీలు మత విద్వేషాలను రెచ్చగొడుతూ, యువతను పక్కదారి పట్టిస్తూ శాంతి భద్రతలను భంగం కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో అలాంటి పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల కమిటీలు సమస్యలతో కూడిన వినతిపత్రాలను ఎమ్మెల్యేకు అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు మణీంధర్‌నాథ్, అటికం రవీందర్, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి లోకిని చందర్, సాంబయ్యనాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షులు కళ్యాణ్‌నాయక్, సాయికుమార్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్వేతార్క ఆలయంలో ప్రత్యేక పూజలు



కోలాటం ఆడుతున్న మహిళలు



శ్వేతార్కుడిని దర్శించుకుంటున్న జడ్జి దంపతులు

కాజీపేట: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయం ఆవరణలో సీతారామచంద్రస్వామి లక్ష్మణ సమేత ఆంజనేయస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల మంత్రోచ్ఛరణలతో దేవతామూర్తులకు అభిషేకాలు, అర్చనలు జరిపించారు. ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ప్రత్యేక పల్లకిలో ఊరేగించారు. సీతారామచంద్రులకు మహిళా భక్తులు 21 మంగళ హారతులు పట్టి భజనలు చేశారు. ఉత్సవమూర్తుల ఊరేగింపులో మహిళలు కోలాటం ఆడారు. కల్యాణోత్సవంలో ఉపయోగించడానికి వడ్ల గింజల నుంచి గోటితో తీసిన అంక్షింతలను భక్తులు సిద్ధం చేశారు. కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపకులు ఐనవోలు అనంత మల్లయ్యశర్మ సిద్ధాంతి, ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణశర్మ, సాయికృష్ణశర్మ, ఆలయ మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్, అచ్యుత్, సుధీర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**శ్వేతార్కుడిని దర్శించుకున్న సివిల్ జడ్జి**

కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూల గణపతి స్వామివారిని హనుమకొండ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాపోలు అనిత – మణిరత్నం దంపతులు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ తర్వాత ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారికి ఆశీర్వచనం చేసి, స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, చిత్రపటం బహూకరించారు.

# రాష్ట్ర సాధనలో కవుల పాత్ర కీలకం

- వరంగల్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ చింతం సదానందం



కవులను సన్మానిస్తున్న సదానందం

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కవులు, రచయితలు కీలక పాత్ర పోషించారని వరంగల్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ చింతం సదానందం గుర్తుచేశారు. సమాజంలోని సామాజిక రుగ్మతలపై సాహిత్యం, కవితల ద్వారా ప్రజలను చైతన్య పర్చాల్సిన బాధ్యత కవులు, రచయితలపై ఉందని అన్నారు. ఉగాదిని పురస్కరించుకొని చింతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు సమాజంలో అనేక సమస్యలున్నాయని, తమ కవితలు, సాహిత్యం ద్వారా పరిష్కారం మార్గం చూపాలని కోరారు. అనంతరం, కవులు, రచయితలను సదానందం సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు కవులు నిర్వహించిన కవి సమ్మేళనం ఆద్యంతం ఆకట్టుకుంది. కార్యక్రమంలో అశోక్, నాగరాజు, సిరాజుద్దీన్, రాంమూర్తి, రమేష్, విజయలక్ష్మి, నరేందర్, సుశీల, ప్రమీల, రఘు, రవి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సమన్వయ కమిటీ సభ్యులు

హసన్‌పర్తి: గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ అన్నారు. మండలంలోని సూదన్‌పల్లి, నాగారం, సీతానాగారం గ్రామాల్లో సమన్వయ కమిటీ బృందం ఆదివారం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రజనీకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఉదయ్‌కుమార్ రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ విజయ్‌కుమార్, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రఘు, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పైపులైన్ లీకేజీలను సరిచేయాలి

కాజీపేట: వేసవికాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు కాజీపేట పట్టణంలో తాగునీటి పైపులైన్లకు ఉన్న లీకేజీలన్నింటిని మున్సిపల్ అధికారులు గుర్తించి తక్షణమే మరమ్మతులు చేయించాలని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యుడు అంకేశ్వరపు కుమారస్వామి డిమాండ్ చేశారు. కాజీపేట ప్రధాన రహదారిపై ఉన్న లీకేజీలను కార్యకర్తలతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం కుమారస్వామి మాట్లాడుతూ పట్టణంలో అడుగడుగునా పైపులైన్ లీకేజీలు ఉన్నా అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. లీకేజీలను అరికట్టని కారణంగా ఎగువ ప్రాంతాల ప్రజలకు తాగునీరు సరిగా అందడం లేదని వాపోయారు.

# రాజకీయ వ్యవస్థలో భాగస్వాములు కావాలి



లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న బాధ్యులు

నయీంనగర్: రాజకీయాలు ప్రజల భవిష్యత్తు, జీవితాలను ప్రభావితం చేస్తాయని, ఈక్రమంలో ప్రజలు రాజకీయ వ్యవస్థలో భాగస్వాములు కావాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. హనుమకొండ నయీంనగర్ వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో ఆదివారం సులక్ష్య సేవా సమితి పదవ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా లక్ష్మీనారాయణ పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ఓటు హక్కుపై, ఓటును వినియోగించడంపై చైతన్యం కలిగించాలన్నారు. ప్రభుత్వ పథకాలను స్వచ్ఛంద సంస్థలు ప్రజల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. అనాథ, వృద్ధ ఆశ్రమాల్లో ఉన్నవారిని, అభాగ్యులను ప్రభుత్వ ఆరోగ్య స్కీంలలో రిజిస్టర్ చేయిస్తే వారికి ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. ప్రతీఒక్కరు వ్యక్తి ధర్మం, వృత్తి ధర్మం, సామూహిక ధర్మం పాటించిండం ద్వారా దేశం ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మండువ సంతోష్ తాము చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఐఆర్‌ఎస్ అధికారి భాగ సందీప్, కౌశిక్ భూపతి, శాంత, సాయికిరణ్, వినయ్, వంశీ, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

# సంఘర్షణ యాత్రకు తరలిరావాలి



మాట్లాడుతున్న ఉప్పలయ్య

హన్మకొండ: ఢిల్లీలో ఏప్రిల్ 5న జరగనున్న మజ్దూర్, కిసాన్ సంఘర్షణ యాత్రకు జిల్లా నుంచి భారీ సంఖ్యలో కార్మికులు, రైతులు తరలిరావాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య పిలుపునిచ్చారు. హనుమకొండ వడ్డెపల్లి చర్చి కూడలిలోని లేబర్ అడ్డాలో ఆదివారం కరపత్రాల ద్వారా ప్రచారం చేసి, గ్రూప్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. దీనికి నిరసనగా వచ్చేనెల 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బానోతు వెంకన్న, సహాయ కార్యదర్శి వల్లెపు రాజు, వేణు, రాసమళ్ల వెంకటేష్, బట్టు రాజు, హన్మంతు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

### క్రీడలతో మానసిక ఉల్లాసం



వరంగల్: అల్పాహారం అందజేస్తున్న సరిత

వరంగల్: క్రీడలతో క్రీడాకారులకు దేహదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని అభయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకురాలు బిట్ల సరిత అన్నారు. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన తైక్వాండో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు భాస్కర్ (ఎస్ఎస్), బిట్ల కృష్ణ, క్రీడల నిర్వాహకులు వావిలాల సారంగపాణి, నయీం పాల్గొన్నారు.



ఖిలా వరంగల్: పోటీల్లో పాల్గొన్న మహిళలు

### మహిళలకు క్రీడాపోటీలు

ఖిలా వరంగల్: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని కార్పొరేటర్ సువర్ణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖిలా వరంగల్ 37వ డివిజన్‌లో నన్నపునేని నర్సింహమూర్తి చారిటబుల్ ఆధ్వర్యంలో మహిళలకు ఆదివారం క్రీడా పోటీలు జరిగాయి. ముఖ్యఅతిథిగా సువర్ణ హాజరై ఆటల పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిల్లా రవి, ఆర్పీలు కల్పన, రాజమణి, లత, మమత, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ప్రశ్నపత్రం లీక్



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీక్ అయ్యిందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తీగల భరత్‌గౌడ్ అన్నారు. పేపర్ లీకేజీకి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో హనుమకొండ-కరీంనగర్ జాతీయ రహదారిపై బీజేపీ నాయకులు ఆదివారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా భరత్‌గౌడ్ మాట్లాడారు. పేపర్ లీకేజీ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, పరీక్షలకు హాజరైన యువతకు లక్ష రూపాయలు చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్, నాయకులు ఎర్రగొల్ల శ్రీనివాస్, నాయకులు జనగాని కిష్టయ్య, ఆడెపు శ్రీవర్ధన్, ముష్కె వెంకటేష్, నాంపల్లి అశోక్, చిదురాల వెంకటేష్, దేవేందర్‌రెడ్డి, పెరుకు మధు, వినయ్‌గౌడ్, వెంకటరమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మా ప్లాట్లు లాక్కుంటున్నారు..



ఆందోళన చేస్తున్న ప్లాట్ల యజమానులు

హసన్‌పర్తి: ఆ కళాశాల కోసం తమ ప్లాట్లు లాక్కుంటున్నారని బాధితులు ఆదివారం ఆందోళన చేశారు. ఆరెపల్లిలోని విజ్ఞాన భారతి స్కూల్ నుంచి నేషనల్ హైవే రోడ్డును కలుపుతూ కుడా ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. అందుకోసం ప్లాట్ల నిర్వాహకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ పనులను అడ్డుకున్నారు. 40ఫీట్ల రోడ్డును 80ఫీట్లకు ఎలా మార్చారని ప్రశ్నించారు. 40 ఫీట్లరోడ్డుతో తాము అనుమతి కూడా తీసుకున్నామని, ఇప్పుడు 80ఫీట్లకు మార్చితే ఉన్న ప్లాటు పూర్తిగా రోడ్డు కింద పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేట్ కళాశాల నిర్వాహకుల ఒత్తిడి వల్ల మ్యాప్ మార్చినట్లు బాధితులు తెలిపారు. పనులు చేపట్టడానికి వచ్చిన కుడా అధికారులు అడ్డగించి నిరసన తెలిపారు.

# ప్రహరీ నిర్మించి.. గేట్ పెట్టలేదు

- ఇబ్బందులు పడుతున్న కూరగాయల వ్యాపారులు
- మార్కెట్లో సంచరిస్తున్న పశువులు, పందులు
- రాత్రి వేళల్లో ఆకతాయిల ఆగడాలు

కాజీపేట: బాపూజీనగర్‌లోని వెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్‌లో ప్రహరీ నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. దాంతో కూరగాయల వ్యాపారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ తన నియోజకవర్గం అభివృద్ధి పథకం నిధుల నుంచి రూ.50లక్షలకు పైగా మంజూరు చేశారు. దాంతో ఐదేళ్ల క్రితం మార్కెట్ చుట్టూ ప్రహరి నిర్మించి విజయనగర్ కాలనీవైపు గేట్ పెట్టకుండా అధికారులు వదిలేశారు. దాంతో అది సమస్యాత్మకంగా మారిందని మార్కెట్ వ్యాపారులు వాపోతున్నారు.

**పలుమార్లు విన్నవించినా..**

గేట్ ఏర్పాటు చేయాలని కోరుతూ కూరగాయల వ్యాపారులు అనేకమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక నాయకుల చొరవ ఫలితంగా మార్కెట్‌లో చిరువ్యాపారులకు కనీస సౌకర్యాలు కల్పిస్తూ పలు అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేశారు. అయితే, మార్కెట్‌కు వెనుక భాగంలో ప్రహరీ నిర్మాణాన్ని పూర్తి చేసిన అధికారులు.. గేట్ పెట్టడానికి చేసిన ప్రయత్నాలను కొంతమంది స్థానికులు అడ్డుకున్నారు. ఇది వ్యాపారులు, సమీప కాలనీవాసులకు మధ్య వివాదంగా మారడమేగాక సమస్య తీవ్రమై చిలికి చిలికి గాలివానగా మారింది.

**సంచరిస్తున్న పశువులు, పందులు**

పుష్కర కాలం క్రితం ప్రభుత్వ స్థలంలో ప్రారంభమైన కూరగాయల మార్కెట్ చుట్టూ ప్రహరీ ఉన్నా విజయనగర్‌కాలనీ వైపు గేట్ లేకపోవడంతో మార్కెట్లోకి పశువులు, పందులు యథేచ్ఛగా సంచారిస్తూ వ్యాపారులు, కొనుగోలుదారులకు ప్రాణసంకటంగా మారాయని వ్యాపారులు చెబుతున్నారు. కాలనీ వైపు గేట్ పెట్టాల్సిందేనని వ్యాపారులు, తమకు ఇబ్బందులు ఎదురవుతాయంటూ కాలనీవాసులు భీష్మించుకుని కూర్చోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అనేక రోజుల క్రితం మార్కెట్‌కు మంచి రోజులు వచ్చాయని భావిస్తున్న తరుణంలో గేట్ పెట్టనీయకపోవడం ఎంత వరకు సమంజసం అని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. మార్కెట్‌కు ఒక వైపు గేట్‌లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో ఆకతాయిలు ప్రవేశించి మద్యం సేవించడం, కూరగాయలను ఎత్తుకెళ్తున్నారని చిరువ్యాపారులు వాపోతున్నారు. మార్కెట్ చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తయినందున అధికారులు ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా వెంటనే గేట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.



కాజీపేటలోని విజయనగర్‌కాలనీ వైపు గేట్ పెట్టాల్సిన ప్రాంతం

# బచ్‌పన్ ప్లే స్కూల్ వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

హన్మకొండ: హనుమకొండ రాంనగర్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్ అండ్ ఎడ్యుకేర్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. హనుమకొండలోని అంబేడ్కర్ నగర్‌లో బచ్‌పన్ స్కూల్ 6వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ రవిశంకర్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు, విలువలు ముఖ్యమని చెప్పారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు నిష్ణాతులైన ఉపాధ్యాయులతో ఉత్తమ విద్యాబోధన అందిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణజ్యోతి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ పైపుల లీకేజీ





పైపులు ధ్వంసం కావడంతో వృథాగా పోతున్న నీరు

హసన్‌పర్తి: మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన పైపులు లీకేజీ అవుతున్నాయి. దాంతో తాగునీరు నేల పాలవుతోంది. ఈక్రమంలో అందరికీ సరిపడా నీరు అందడం లేదు. 66వ డివిజన్ హసన్‌పర్తిలోని గాంధీనగర్‌లో పలు చోట్లు పలు పైపులు లీకేజీ అయ్యాయి. దాంతో నీటి సరఫరా సమయంలో రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.